నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02









# 5 పథకాలకు ఒకే దరఖాస్తు

## జతపర్చాల్సినవి ఆధార్, రేషన్‌కార్డు కాపీలు 4 పేజీలతో 'ప్రజాపాలన దరఖాస్తు'

'అభయహస్తం' గ్యారంటీ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం రాష్ట్ర ప్రభుత్వం సమాచారం తీసుకోనుంది. 'ప్రజాపాలన దరఖాస్తు' ఫారాన్ని బుధవారం విడుదల చేసింది. ఇందులో నాలుగు పేజీలున్నాయి. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత.. అయిదు పథకాల వివరాలు ఇందులో ఉన్నాయి. ప్రతి పథకానికి వేర్వేరుగా దరఖాస్తు చేసుకోనవసరం లేదు. ఏ పథకానికి అర్హులైనవారు ఆ పథకానికి అవసరమైన వివరాలు మాత్రమే దరఖాస్తు ఫారంలో నింపాలి. అన్ని పథకాలకూ అర్హులైనా.. ఒకే దరఖాస్తులోని ఆయా వివరాలు నింపితే సరిపోతుంది. దరఖాస్తు ఫారంతో పాటు రేషన్‌కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, దరఖాస్తుదారు ఫొటో ఇవ్వాలి.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
అభయహస్తం

ప్రజా పాలన
28.12.2023 - 06.01.2024
ప్రజా పాలన దరఖాస్తు
(మహాలక్ష్మి / రైతు భరోసా / గృహ జ్యోతి / ఇందిరమ్మ ఇండ్లు / చేయూత పథకముల కొరకు)

కుటుంబ వివరాలు

దరఖాస్తుదారు వివరాలు: దరఖాస్తు సంఖ్య:

దరఖాస్తుదారుని ఫోటో

1. దరఖాస్తుదారు (ఇంటి యజమాని) పేరు:
2. స్త్రీ పురుషుడు ఇతరులు
3. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ ఇతరులు
4. పుట్టిన తేదీ:
5. ఆధార్ నంబరు:
6. రేషన్ కార్డు నంబరు:

**కుటుంబ వివరాలు**

తొలి పేజీలో కుటుంబ యజమాని పేరు, పుట్టిన తేదీ, ఆధార్ సంఖ్య, రేషన్‌కార్డు సంఖ్య, మొబైల్ ఫోన్ నంబరు, వృత్తితో పాటు సామాజికవర్గం వివరాలను నింపాలి. ఇందులో దరఖాస్తుదారు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతరులు.. ఏ విభాగంలోకి వస్తే అక్కడ టిక్ పెట్టాలి. కింద కుటుంబసభ్యుల పేర్లు, వారి పుట్టిన తేదీలు, వారి ఆధార్ నంబర్లు పేర్కొనాలి. తర్వాత దరఖాస్తుదారు చిరునామా రాయాలి.

**పథకం ముందు టిక్ చేయాలి ...**

కుటుంబ వివరాల తర్వాత.. అయిదు పథకాలకు సంబంధించిన వివరాలున్నాయి. ఏ పథకానికి దరఖాస్తు చేయాలని అనుకుంటే ఆ పథకం దగ్గర టిక్ చేయడంతో పాటు అందులో అడిగిన వివరాలు రాయాలి.

**మహాలక్ష్మి- రూ.2,500 ఆర్థిక సహాయం:** ఈ పథకం కింద ఆర్థిక సాయం పొందాలంటే అక్కడ బాక్సులో టిక్ పెట్టాలి. ఇదే పథకంలో భాగమైన రూ.500కు గ్యాస్ సిలిండర్ లబ్ధి పొందాలంటే.. గ్యాస్ కనెక్షన్ సంఖ్య, సిలిండర్ సరఫరా చేస్తున్న గ్యాస్ కంపెనీ పేరు, సంవత్సరానికి ఎన్ని సిలిండర్లు వాడుతున్నారు? అనే వివరాలు రాయాలి.

**రైతుభరోసా:** ఈ పథకం కింద లబ్ధి పొందాలనుకునే వ్యక్తి రైతా? కౌలు రైతా?.. అక్కడ టిక్ పెట్టాలి. పట్టాదారు పాసుపుస్తకం నంబర్లు. సాగు చేస్తున్న భూమి సర్వే నంబరు, సాగు విస్తీర్ణం లెక్కలు రాయాలి. దరఖాస్తుదారు వ్యవసాయ కూలీ అయితే.. ఉపాధి హామీ కార్డు నంబరు రాయాలి.

**ఇందిరమ్మ ఇళ్లు:** ఇల్లు లేని వారైతే ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం బాక్సులో టిక్ చేయాలి. అమరవీరుల కుటుంబ సభ్యులు తమ పేరుతోపాటు.. అమరుడి పేరు, ఆయన మృతి చెందిన సంవత్సరం, ఎఫ్ఐఆర్, డెత్ సర్టిఫికెట్ నంబరు వివరాలు రాయాలి. తెలంగాణ ఉద్యమకారులైతే ఎదుర్కొన్న కేసుల ఎఫ్ఐఆర్, సంవత్సరం, జైలుకు వెళితే ఆ సంవత్సరం, జైలు పేరు, శిక్షా కాలం వివరాలు అందించాలి.

**గృహజ్యోతి:** కుటుంబానికి ప్రతి నెల 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు పథకం కింద.. దరఖాస్తుదారు నెలవారీ విద్యుత్తు వినియోగం వాడకం వివరాలు నింపాలి. ఇందులో 0-100 యూనిట్లు, 100-200 యూనిట్లు, 200 యూనిట్లపైన.. ఈ మూడింటిలో ఒక దాని ఎదురుగా టిక్ చేయాలి. గృహ వినియోగ విద్యుత్ మీటర్ కనెక్షన్ సంఖ్య రాయాలి.

**చేయూత:** ఇప్పటికే పింఛను అందుకుంటున్నవారు 'చేయూత' పథకానికి దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. కొత్తగా పింఛను కోరుతున్నవారు మాత్రమే తమ వివరాలు ఇందులో రాయాలి. దివ్యాంగులైతే సంబంధిత బాక్సులో టిక్ చేసి సదరం సర్టిఫికెట్ సంఖ్య రాయాలి. ఇతరుల్లో.. వృద్ధాప్య, వితంతు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, డయాలసిస్ బాధితులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళ, ఫైలేరియా బాధితులు, బీడీ టేకేదార్‌లలో.. ఎవరైతే వారికి సంబంధించిన బాక్సులో టిక్ చేయాలి.

.. చివరి పేజీలో దరఖాస్తుదారు సంతకం లేదా వేలిముద్రతో పాటు పేరు, తేదీ రాయాలి. నింపిన దరఖాస్తు ఫారాన్ని గ్రామసభ, వార్డు సభల్లో సమర్పించాలి. దరఖాస్తు ఆఖరి పేజీలో కింది భాగంలో 'ప్రజాపాలన దరఖాస్తు రసీదు' ఉంటుంది. దరఖాస్తుదారు పేరు, సంఖ్యతో పాటు దరఖాస్తు చేసిన పథకాల బాక్సుల్లో టిక్ చేసి, సంబంధిత అధికారి సంతకం చేసి రసీదు ఇస్తారు.

# నటుడు విజయకాంత్ ఇకలేరు..

## చికిత్స పొందుతూ మృతి



ప్రముఖ కోలీవుడ్ నటుడు, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ (71) ఇకలేరు. అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ మరణించారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు చెన్నైలోని మియాట్ ఇంటర్నేషనల్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇటీవలే తీవ్ర అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స తీసుకున్న విజయకాంత్.. కొన్ని రోజుల క్రితమే డిశ్చార్జి అయ్యారు. అంతలోనే మరోసారి ఆస్పత్రి పాలయ్యారు. 'కెప్టెన్' మృతిపట్ల ఆయన అభిమానులు, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతికి గురయ్యారు. విజయకాంత్ గతంలో మధుమేహం ఇతరత్రా సమస్యలతోనూ బాధపడ్డారు.

**కుటుంబ నేపథ్యం..**

విజయకాంత్ 1952 ఆగస్టు 25న మధురై (తమిళనాడు)లో జన్మించారు. ఆయన అసలు పేరు నారాయణన్ విజయరాజ్ అళగర్‌స్వామి. చిత్ర పరిశ్రమలోకి వెళ్లిన తర్వాత విజయకాంత్‌గా మారారు. తల్లిదండ్రులు కె.ఎన్. అళగర్‌స్వామి, ఆండాళ్ అజగర్‌స్వామి. విజయకాంత్‌కు భార్య ప్రేమలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరైన షణ్ముఖ పాండియన్ 'సగప్తం', 'మధుర వీరన్' చిత్రాల్లో నటించారు.



**నట ప్రస్థానం..**

27 ఏళ్ల వయసులో విజయకాంత్ తెరంగేట్రం చేశారు. ఆయన నటించిన తొలి సినిమా 'ఇనిక్కుమ్ ఇలమై' (1979). ప్రతినాయకుడి పాత్రతోనే ఆయన ప్రేక్షకులకు పరిచయం అయ్యారు. అప్పటి నుంచి 2015 వరకు నిర్విరామంగా నటించారాయన. 3 షిఫ్టుల్లో పనిచేసేవారు. కెరీర్ ఆరంభంలో కాస్త పరాజయాలు అందుకున్న విజయకాంత్.. ఎస్.ఎ.చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'దూరతు ఇడి ముళక్కం', 'సత్తం ఓరు ఇరుత్తరై'లతో విజయాలు అందుకున్నారు. ఆయన నటించిన సినిమాల సంఖ్య 150కి పైగానే. 1984లో ఆయన నటించిన 18 సినిమాలు విడుదలవడం విశేషం. పోలీసు అధికారిగా 20కి పైగా సినిమాల్లో కనిపించారు. ఆయన నటించిన ఆఖరి సినిమా 'సగప్తం' (2015). విజయకాంత్ తన సినిమాల్లో ఏదో ఒక సందేశం ఉండేలా చూసుకునేవారు. దేశభక్తి సినిమాలైనా, గ్రామీణ నేపథ్య చిత్రాలైనా, ద్విపాత్రాభినయం చేయాలన్నా విజయకాంత్ అందరికంటే ముందుండేవారు. మరోవైపు కమర్షియల్ చిత్రాల్లోనూ సందడి చేసేవారు. ఇతరుల్లా కాకుండా ఆయన పారితోషికాన్ని ముందుగా తీసుకునేవారుకాదట. తనతో సినిమా నిర్మించే నిర్మాతలు ఆర్థిక సమస్యల్లో ఉన్నారని తెలిస్తే వారి నుంచి రెమ్యునరేషన్ తీసుకునేవారు కాదట.

**విప్లవ కళాకారుడు..**

తన కెరీర్‌లో విజయకాంత్ కేవలం తమిళ చిత్రాలే తప్ప ఇతర భాషల్లో నటించలేదు. కానీ, ఆయన సినిమాలు తెలుగు, హిందీలో డబ్ అయి అక్కడా మంచి విజయాలు సాధించాయి. 'శివప్పు మల్లి' (ఎర్ర మల్లెలు రీమేక్), 'జదిక్కొరు నీధి' తదితర చైతన్యవంతమైన సినిమాల్లో నటించడంతో కోలీవుడ్‌లో ముందుగా ఆయన్ను 'పురట్చి కలైంజ్ఞర్' (విప్లవ కళాకారుడు) అనేవారు. తర్వాత అభిమానులంతా 'కెప్టెన్ విజయకాంత్'గా పిలుచుకోవడం మొదలుపెట్టారు. ఆయన వందో చిత్రం 'కెప్టెన్ ప్రభాకరన్' బాక్సాఫీసు వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవడమే అందుకు కారణం.

**నిర్మాత, దర్శకుడిగా..**

విజయకాంత్ దర్శకత్వం వహించిన ఒకే ఒక చిత్రం 'విరుధగిరి'. అందులో ఆయనే హీరో. తన బావ ఎల్.కె. సుధీశ్‌తో కలిసి 'వల్లారసు', 'నరసింహ', 'సగప్తం' తదితర చిత్రాలను నిర్మించారు. 1994లో 'తమిళనాడు స్టేట్ ఫిల్మ్ ఆనరరీ అవార్డు' (ఎంజీఆర్ పురస్కారం), 2001లో 'కళైమామణి అవార్డు' (తమిళనాడు ప్రభుత్వం) అందుకున్నారు. 2001లో 'బెస్ట్ ఇండియన్ సిటిజెన్ అవార్డు', 2009లో 'టాప్ 10 లెజెండ్స్ ఆఫ్ తమిళ్ సినిమా అవార్డు', 2011లో 'ఆనరరీ డాక్టరేట్' (ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చర్చ్ మేనేజ్‌మెంట్) పొందారు. పలు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు.

**ఇతర స్టార్ నటులతో కలిసి..**

కోలీవుడ్‌లో తెరకెక్కిన తొలి 3డీ చిత్రం విజయకాంత్ నటించిన 'అన్నై భూమి'. ఇందులో ఆయన రాధారవి, కన్నడ నటుడు టైగర్ ప్రభాకర్‌తో కలిసి నటించారు. 'ఈట్టి'లో కన్నడ నటుడు విష్ణువర్ధన్‌తో, 'మనకనక్కు'లో కోలీవుడ్ నటుడు కమల్‌హాసన్‌తో, 'వీరపాండియన్'లో తమిళ నటుడు శివాజీ గణేశన్‌తో కలిసి తెరను పంచుకున్నారు. ఒకానొక సమయంలో రజనీకాంత్, కమల్‌హాసన్‌లకు విజయకాంత్ గట్టి పోటీనిచ్చారు.

**అలా రాజకీయాల్లోకి..**

ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2005లో డీఎండీకే పార్టీని స్థాపించారు. 2006, 2011 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. 2016 ఎన్నికల్లో పరాజయం పొందారు.




# జొమాటోకు రూ.401 కోట్ల జీఎస్‌టీ డిమాండ్ నోటీసు..

ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటోకు 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్‌టీ ఇంటెలిజెన్స్' జీఎస్‌టీ డిమాండ్ నోటీసులు జారీ చేసింది. వినియోగదారుల నుంచి వసూలు చేసిన డెలివరీ ఫీజుపై జీఎస్‌టీకి సంబంధించిన బకాయిలు చెల్లించాల్సి ఉందంటూ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. రూ.401 కోట్లు బకాయి పడినట్లు ఆ నోటీసులో పేర్కొంది. డెలివరీ అనేది సేవ కాబట్టి 18 శాతం జీఎస్‌టీ కట్టాలని డీజీజీఐ స్పష్టం చేసింది. షోకాజ్ నోటీసుపై జొమాటో స్పందించింది. తమవైపు నుంచి ఎలాంటి పన్ను బకాయిలూ లేవని తెలిపింది. డెలివరీ భాగస్వాముల తరఫున తాము డెలివరీ ఛార్జీలు వసూలు చేశామని పేర్కొంది. అలాగే కస్టమర్లకు తాము నేరుగా డెలివరీ సేవలు అందించలేదని, పరస్పర ఆమోదంతో కుదుర్చుకున్న నియమ నిబంధనల ప్రకారం.. డెలివరీ భాగస్వాములే ఆ సేవలను అందించారని వివరించింది. జొమాటోలో కస్టమర్ ఫుడ్ ఆర్డర్ చేసినప్పుడు బిల్లులో మూడు అంశాలు ఉంటాయి. అందులో ఆహార పదార్థాల ధర ఒకటి. మరొకటి ఫుడ్ డెలివరీ ఛార్జీ. సబ్‌స్క్రిప్షన్ తీసుకున్నవారికి దీని నుంచి మినహాయింపు ఉంటుంది. మూడోది ఆహారం ధర, ప్లాట్‌ఫామ్ ఫీజుపై ఐదు శాతం పన్ను. ఈ ట్యాక్స్‌ను జీఎస్‌టీ మండలి 2022 జనవరి నుంచి అమలు చేస్తోంది.

# కోలారులో పరువు హత్య.. కూతురుని కాల్చేసిన తండ్రి



వివాహం అయినా తన పాత ప్రేమికుడ్ని తరచుగా కలుస్తోన్న ఆమె తీరుపై తండ్రికి ఆగ్రహం కలిగింది. ఏమాత్రం తీరుమార్చుకోని అర్పిత (17) అనే యువతిని ఆమె తండ్రి రవి (41) చివరికి కడతేర్చాడని పోలీసులు గుర్తించారు. ఈ హత్య జరిగిన ఏడు నెలలకు రవి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పోలీస్ అధికారుల సమాచారం ప్రకారం.. ముళబాగిలు తాలూకా ముష్టూరు సమీపంలోని మరవేమన గ్రామంలో తన పొలంలో ఎండుగడ్డి మోపుల మధ్య కుమార్తె మృతదేహాన్ని ఉంచి మే 21న కాల్చివేశాడని ప్రాథమిక దర్యాప్తులో ముష్టూరు ఠాణా పోలీసులు గుర్తించారు. అర్పిత తమ బంధువుల కుటుంబంలోని ఒక యువకుడ్ని ప్రేమించింది. వరుసకు అతను అన్న అవుతాడని, దూరంగా ఉండాలని తల్లిదండ్రులు ఆమెకు హితవు పలికారు. అయినా ఆమె తీరు మార్చుకోకపోవడంతో ఓ సంబంధం చూసి వివాహం చేశారు. అత్తింటికి వెళ్లిన తర్వాత కూడా ఆమె ఆ యువకుడికి ఫోన్ చేస్తూ మాట్లాడుతున్నట్లు గుర్తించారు. ఆమెను గత మే మొదటి వారంలో మరవేమన గ్రామానికి రవి తీసుకువచ్చాడు. రెండు వారాల తర్వాత కుమార్తెను హత్య చేసి, శవాన్ని కాల్చి వేశాడని పోలీసులు తేల్చారు. నిజానికి తన కుమార్తె కనిపించడం లేదని అక్టోబరు చివరి వారంలో రవి నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టిన అనంతరం రవి ప్రవర్తనపై అనుమానం వచ్చింది. అతన్ని అదుపులోనికి తీసుకుని విచారణ చేపట్టగా తానే కుమార్తెను హత్య చేశానని అంగీకరించాడు. అర్పితను వివాహం చేసుకున్న యువకుడు, అతని నలుగురు కుటుంబ సభ్యులపై బాల్యవివాహాల చట్టాలకు అనుగుణంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని ఎస్పీ నారాయణ్ తెలిపారు.

# టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 పరీక్షలు మళ్లీ వాయిదా




రాష్ట్రంలో 'గ్రూప్-2' రాతపరీక్షలు మరోసారి వాయిదా పడ్డాయి. వచ్చే నెల 6, 7 తేదీల్లో జరగాల్సిన ఈ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితారామచంద్రన్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త తేదీలను తరువాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. గ్రూప్-2లో 783 పోస్టులతో టీఎస్‌పీఎస్సీ గత ఏడాది ఉద్యోగ ప్రకటన జారీచేసిన సంగతి తెలిసిందే. 2023 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు దరఖాస్తులు స్వీకరించగా.. 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలుత ఆగస్టు 29, 30 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష నిర్వహించేందుకు కమిషన్ షెడ్యూల్ జారీ చేసింది. కానీ నిరుద్యోగులైన అభ్యర్థుల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు దాన్ని నవంబరు 2, 3 తేదీలకు మార్చారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# సైన్యాన్ని రెడీ చేస్తున్న ఉత్తర కొరియా కిమ్




ప్రపంచంలో మరో యుద్ధం రాబోతుందా.. అది ఉత్తర కొరియా నుంచి ప్రారంభం కాబోతుందా అంటే అవుననే అంటున్నాయి అంర్జాతీయ మీడియా. రెండు రోజుల క్రితం అంటే.. డిసెంబర్ 27వ తేదీన ఉత్తరకొరియా ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో.. యుద్ధానికి రెడీ అవ్వండి.. యుద్ధ సన్నాహాలు వేగవంతం చేయండి.. విమానాలు, యుద్ధ ట్రక్కులు, రాకెట్లను, సర్వ సైన్యాన్ని యుద్ధానికి సిద్ధం చేయండి అంటూ.. ఆ దేశ అధ్యక్షుడు కిమ్ స్వయంగా ఆదేశించటం.. ఇప్పుడు ప్రపంచానికి కునుకు లేకుండా చేస్తుంది. ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్, ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధంతో మధ్య ఆసియా దేశాలు అల్లకల్లోలంగా ఉన్నాయి. ఇప్పుడు ఉత్తరకొరియా యుద్ధానికి దిగితే.. అది కచ్చింతగా తన ఆగర్భ శత్రువు దక్షిణి కొరియాపైనే ఉంటుంది.. దక్షిణి కొరియాతో యుద్ధానికి కిమ్ దిగితే.. ఆ వెంటనే అమెరికా ఎంట్రీ ఇస్తుంది.. ఈ పరిణామాలే ఇప్పుడు ప్రపంచ దేశాలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. కిమ్ జోంగ్ ఉన్.. ప్రస్తుతం యుద్ధ సన్నాహాల్లో బిజీగా ఉండటమే కాకుండా.. రష్యాకు చాలా దగ్గరగా ఉన్నారు. ఉక్రెయిన్ తో యుద్ధం చేస్తున్న రష్యాకు మద్దతుగా సైనిక సాయం సైతం అందిస్తున్నారని.. ఇప్పటికే అమెరికా ఆరోపిస్తుంది. రష్యాకు అందిస్తున్న సాయంపై.. అమెరికా ఇప్పటికే పలుమార్లు హెచ్చరించింది. ఈ క్రమంలోనే కిమ్.. యుద్ధానికి సిద్ధం అవుతున్నట్లు.. ఏకంగా ఆ దేశ కేంద్ర కమిటీ ప్లీనరీలోనే.. స్వయంగా ప్రకటించటంతో ప్రపంచ దేశాలను అలర్ట్ చేస్తుంది. ఉత్తర కొరియా కేంద్ర కమిటీ సమావేశంలో అధ్యక్షుడు కిమ్ చేసిన ప్రసంగం సైతం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. అణు సామర్థ్యాన్ని మరింత పెంచాలని సైన్యానికి పిలుపునివ్వటం.. మిగతా దేశాలకు కంగారు పుట్టిస్తుంది. ఇప్పటికే కిమ్.. 100 బాలిస్టిక్ ఖండాంతర క్షిపణి ప్రయోగాలను స్వయంగా పర్యవేక్షించాడు. ఇప్పుడు అణు ప్రయోగాలపైనా మాట్లాడాడు.. ఈ క్రమంలోనే పొరుగు దేశం అయిన దక్షిణి కొరియా అప్రమత్తం అయ్యింది. కిమ్ ఏ మాత్రం రెచ్చగొట్టినా.. యుద్ధానికి కాలుదువ్వితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇచ్చింది. పదేళ్లుగా కిమ్ ఇలాంటి ప్రయోగాలు చేయటం.. రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం.. యుద్ధ సన్నాహాలు చేయటం కామన్ ... మరి ఈ సారి కూడా మాటలకే పరిమితం అవుతాడా లేక యుద్ధానికి నిజంగా దిగుతాడా అనేది చూడాలి.



## రెడ్ ఫిట్ డ్రెస్సులో జాన్వీ కపూర్ ఖతర్నాక్ లుక్స్

బాలీవుడ్ భామ జాన్వీ కపూర్.. తన కొత్త ఫోటోషూట్ తో సోషల్ మీడియాని హీటెక్కిస్తున్నారు. రెడ్ ఫిట్ డ్రెస్సులో పరువాలు ఒలికిస్తున్న జాన్వీ ఖతర్నాక్ లుక్స్ చూసి నెటిజెన్స్ ఫిదా అవుతున్నారు.జాన్వీ కపూర్.. శ్రీదేవి కుమార్తె అని తెలిసిందే. 'ధడక్' అనే సినిమాతో హిందీ చిత్ర సీమకు పరిచయమైంది. ఆ సినిమా హిట్ తర్వాత జాన్వీ పలు హిందీ చిత్రాల్లో నటిస్తూ బిజీ అయ్యింది. జాన్వీ తెలుగులో ఎన్టీఆర్ దేవర సినిమాతో ఎంట్రీ ఇస్తోంది.జాన్వీ తెలుగులో ఎన్టీఆర్ సరసన ఎన్టీఆర్ 30లో నటిస్తున్నసంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ మూవీ ద్వారా ఆమె తొలిసారిగా సౌత్ సినిమా ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇస్తుండడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపింది జాన్వీ. కొరటాల శివ దర్శకుడు.ఈ సినిమాలో జాన్వీ కపూర్ మత్స్యకారుని కూతురిగా కనిపిస్తోందని.. జాన్వీ లుక్ కూడా చాలా వరకూ లంగా ఓణిలో ఉంటుందని టాక్. ఇక ఈ సినిమాలో ఎన్టీఆర్ మరోసారి ఆర్ ఆర్ ఆర్ తర్వాత ట్రైబల్ లుక్‌లో కనిపించనున్నారని, ఈ సినిమాలో తన పాత్ర పేరు తంగం అని తెలుస్తోంది.. అది అలా ఉంటే జాన్వీ త్వరలో పెళ్లి చేసుకోబోతోందని ఓ వార్త ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విషయంలోకి వస్తే.. జాన్వీ గత కొన్ని రోజులుగా ఓ వ్యక్తితో ప్రేమలో ఉందని ఓ రూమర్ వైరల్ అవుతోన్న సంగతి తెలిసిందే. శిఖర్ పహారియా అనే వ్యక్తితో ఆమె డేటింగ్‌లో ఉందని టాక్.







## 'అమృత్ భారత్' ఛార్జీలు 15-17 శాతం ఎక్కువ రాయితీలు వర్తించవన్న రైల్వేబోర్డు

కొన్ని ప్రత్యేక హంగులు ఉండేలా రైల్వేశాఖ కొత్తగా ప్రవేశపెడుతున్న 'అమృత్ భారత్' ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ద్వితీయ శ్రేణి, స్లీపర్ తరగతుల్లో టికెట్ ఛార్జీలు ఇతర మెయిల్/ ఎక్స్‌ప్రెస్‌ల కంటే 15-17% ఎక్కువగా ఉంటాయి. 50 కి.మీ.లోపు దూరానికి కనీస టికెట్ ధర రూ.35గా ఉంటుంది. దానికి రిజర్వేషన్ రుసుం, ఇతర ఛార్జీలు అదనమని రైల్వేబోర్డు అన్ని జోన్లకు సమాచారమిచ్చింది. ఈ రెండు తరగతుల్లో ఏయే దూరానికి ఎంతెంత ఛార్జీలు వసూలు చేసేదీ తెలిపే పట్టికను దానికి జతచేసింది. ప్రభుత్వం తిరిగి చెల్లించని (రీయంబర్స్ చేయని) రాయితీ/ ఉచిత టికెట్లను ఈ రైల్లో అనుమతించబోరు. రైల్వే సిబ్బందికి ఇచ్చే పాసులు, ప్రివిలేజ్ టికెట్ ఆర్డర్ (పీటీవో)ల విషయంలో నిబంధనలు.. మెయిల్/ ఎక్స్‌ప్రెస్‌లతో సమానంగా ఉంటాయి. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్వాతంత్ర్యసమరయోధుల టికెట్ల సొమ్మును ప్రభుత్వం పూర్తిగా తిరిగి చెల్లిస్తున్నందువల్ల వారి పాసులు/ కూపన్లు ఈ రైళ్లలో చెల్లుతాయి. అయోధ్య నుంచి బయల్దేరేలా తొలి అమృత్ భారత్ రైలుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 30న ఆ నగరంలో జెండాఊపి ప్రారంభించనున్నారు. తొలిరైలులో సెకెండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ మాత్రమే ఉంటాయి. ఏసీ తరగతుల రుసుములు ఇంకా ఖరారు చేయాల్సి ఉంది.

## ఏఐటీయూసీకి జై కొట్టిన సింగరేణి ఓటర్లు




ఏడాదిన్నర కాలంగా ఎదురు చూస్తున్న సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల సంరంభం ముగిసింది. సింగరేణి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీపీఐ అనుబంధ AITUC సత్తా చాటింది. అత్యధిక ఓట్లతో నక్షత్రం గుర్తుకు కార్మికులు పట్టం కట్టారు. INTUCపై దాదాపు 2 వేల ఓట్ల ఆధిక్యంతో AITUC గెలుపొందింది. దాంతో.. సింగరేణిలో గుర్తింపు సంఘంగా AITUC ఆవిర్భవించింది. సింగరేణిలో మొత్తం 11 ఏరియాలు ఉండగా.. 5 చోట్ల ఏఐటీయూసీ, 6 చోట్ల ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘాలుగా గెలుపొందాయి. బెల్లంపల్లి రీజియన్‌లోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో, రామగుండం రీజియన్‌లోని రామగుండం-1, 2 ఏరియాల్లో AITUC విజయం సాధించింది. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, భూపాలపల్లి ఏరియాలో, రామగుండం రీజియన్‌లోని రామగుండం-3లో INTUC గెలుపొందింది. సింగరేణి ఎన్నికల్లో AITUC, INTUC హోరాహోరీగా తలపడ్డాయి. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్, రామగుండం-1, 2లో AITUC స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. అత్యధిక ఓట్లతో ఆయా ప్రాంతాల్లో ప్రాతినిధ్యం దక్కించుకుంటూనే అత్యధిక ఓట్లను రాబట్టింది. ఒక్క శ్రీరాంపూర్‌లోనే 2,166 ఓట్ల ఆధిక్యం చేజిక్కించుకోవడం పోలింగ్‌లోనే టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం కార్పొరేట్, రామగుండం-3, భూపాలపల్లిలో AITUCపై INTUC స్వల్ప ఆధిక్యంతో ప్రాతినిధ్యం నిలుపుకోగలిగింది. మరోవైపు.. 2012, 2017లో సత్తా చాటిన బీఆర్ఎస్ అనుబంధ TBGKS ఈసారి ఎన్నికల్లో ఖాతా కూడా తెరవలేకపోయింది. సింగరేణి ఎన్నికల్లో ఉదయం నుంచే కార్మికులు పోలింగ్ కేంద్రాల దగ్గర బారులు దీరారు. దాంతో.. గంటగంటకూ పోలింగ్ శాతం పెరిగింది. సింగరేణి విస్తరించి ఉన్న ఆరు జిల్లాల్లోని 11 డివిజన్లలో జరిగిన ఎన్నికల్లో 94.15 పోలింగ్ శాతం నమోదైంది. మొత్తం 39,773 మంది ఓటర్లు ఉండగా.. 37,447 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక.. ఈ ఎన్నికల్లో 13 కార్మిక సంఘాలు బరిలో ఉండగా.. ప్రస్తుత గుర్తింపు సంఘం TBGKS ప్రధాన నాయకత్వం ప్రచారానికి దూరంగా ఉండటంతో ద్వితీయశ్రేణి నాయకులు అంతంత మాత్రంగానే ప్రచారం చేపట్టారు. INTUC తరఫున కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రచారం నిర్వహించారు. AITUC, CITU, BMS, HMS సంఘాల నాయకులు తమకున్న క్యాడర్‌తో గనుల్లో పట్టు కోసం ప్రయత్నించారు. కొన్ని సంఘాలు గ్యారంటీల పేరుతో ప్రచారం నిర్వహించాయి. అయితే.. INTUC, AITUC మాత్రమే ఎన్నికల్లో సత్తా చాటాయి. మొత్తంగా.. సింగరేణి ఎన్నికల్లో AITUC గెలుపు బావుటా ఎగురవేసింది. సింగరేణి ఎన్నికల్లో గెలుపు పొందడంతో AITUC నాయకులు సంబరాలు చేసుకున్నారు.



## దొరల ప్రభుత్వం కాదు.. ప్రజల ప్రభుత్వం: భట్టి విక్రమార్క

కాంగ్రెస్ ప్రభుత్వం దొరల ప్రభుత్వం కాదు.. ప్రజల ప్రభుత్వం అన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. అబ్దుల్లాపూర్ మెట్ లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. ఈ ప్రభుత్వం ప్రజలకు అంకితమన్నారు. రాష్ట్ర ప్రజలందరికి పథకాలు అందిస్తామన్నారు. ప్రజల దగ్గరికే వెళ్లి అప్లికేషన్లు స్వీకరిస్తామన్నారు. పదేళ్లుగా తెలంగాణ ప్రజలు ఇబ్బంది పడ్డారని చెప్పారు డిప్యూటీ సీఎం భట్టి.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే బాగుండని బీఆర్ఎస్ చూస్తుందన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం పథకాలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం మాదిరి బెదిరింపులు ఉండబోవన్నారు. రాజకీయ పార్టీలకతీతంగా పథకాలు అందిస్తామన్నారు. రాష్ట్ర బిడ్డలైతే చాలు అప్లై చేసుకోవచ్చన్నారు. పేదలకు ఇచ్చిన భూములను గత ప్రభుత్వం లాక్కుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇవాళ్టి నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల కోసం గ్రామసభల్లో అప్లికేషన్లు స్వీకరిస్తున్నారు.



## 500 కోట్ల క్లబ్ లోకి "సలార్"

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం లో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్టైనర్ సలార్. ఈ చిత్రం థియేటర్ల లో రిలీజ్ అయ్యి ప్రేక్షకులను, అభిమానులని విశేషం గా ఆకట్టుకుంటుంది. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో దూసుకు పోతుంది. ఈ చిత్రం ఇప్పటి వరకూ వరల్డ్ వైడ్ గా 500 కోట్ల రూపాయలకి పైగా గ్రాస్ వసూలు చేయడం జరిగింది. దీంతో ప్రభాస్ మరో చిత్రం 500 కోట్ల క్లబ్ లో చేరడం జరిగింది. ఈ చిత్రం కి రేపటి నుండి టికెట్ ధరలు తక్కువగా ఉండటం తో సినిమా వసూళ్ళు మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ లో శృతి హాసన్ హీరోయిన్ గా నటించగా, పృథ్వీ రాజ్, జగపతి బాబు, శ్రియా రెడ్డి, ఈశ్వరి రావు తదితరులు కీలక పాత్రల్లో నటించారు. హొంబలే ఫిల్మ్స్ బ్యానర్ పై నిర్మించిన ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందించారు.

## మనీలాండరింగ్ కేసు ఛార్జిషీటులో ప్రియాంక గాంధీ పేరు



కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీపై మనీ లాండరింగ్ కేసు పెట్టింది ఈడీ.. ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్. హర్యానాలోని ఓ భూమి కొనుగోలు విషయంలో ఆమె పేరును ఛార్జిషీటులో పొందపర్చారు అధికారులు. NRI వ్యాపారవేత్త అయిన సీపీ థంపి, బ్రిటన్ జాతీయుడు అయిన సుమిత్ చద్దాపై నమోదైన మనీలాండరింగ్ కేసు విచారణలో భాగంగా.. ఛార్జిషీట్ లో ప్రియాంక గాంధీతోపాటు ఆమె భర్త రాబర్ట్ వాద్రా పేర్లను ప్రస్తావించింది ఈడీ.. ఈ మేరకు డిసెంబర్ 28వ తేదీన ఈ విషయం బయటకు వచ్చింది. ప్రియాంక గాంధీ భర్త రాబర్ట్ వాద్రా 2006 సంవత్సరంలో ఫరీదాబాద్ ప్రాంతంలోని అమీపూర్ గ్రామంలో రియల్ ఎస్టేట్ ఏజెంట్ అయిన హెచ్ఎల్ పహ్వా ద్వారా 40 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. 2010లో అదే భూమిని తిరిగి పహ్వాకు అమ్మేశారు. అదే విధంగా 2006లో అమీపూర్ గ్రామంలో హెచ్ఎల్ పహ్వా ద్వారా.. ప్రియాంక గాంధీ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. 2010లో అదే ఇంటిని తిరిగి పహ్వాకు అమ్మటం జరిగింది.